క్లుప్తంగా

ఉపాధి పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శకుంతల

పెద్దపప్పూరు: ఉపాధి పనులను అన్ని గ్రామాల్లో విరివిగా చేపట్టాలని ఎంపీడీఓ శకుంతల సూచించారు. శుక్రవారం ఆమె ఎంపీడీఓ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పనులు జరుగుతున్న ప్రదేశంలో నిబంధనల మేరకు అన్ని వసతులు కల్పించాలన్నారు. పనుల నిర్వహణలో ఎలాంటి విమర్శలు వచ్చినా శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి

యాడికి: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పచ్చారుమేకలపల్లి రహదారిలో ఆసుపత్రి కాలనీ, ఎస్సీ కాలనీ, చౌడేశ్వరీ కాలనీ ప్రజలతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సమస్యలు పరిష్కరించాలని ఆయా కాలనీలకు చెందిన ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా.. విడతలవారీగా సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కొంత కాలంగా ఎక్స్‌ప్రెస్ సర్వీసు బస్సులు తాడిపత్రి నుంచి రాయలచెరువు మీదుగా గుత్తికి పోతున్నాయని దీంతో యాడికి ప్రజలు రాత్రి పూట చాలా ఇబ్బందులు ఎదుర్కొంటు న్నామని, అలాగే ఎక్స్‌ప్రెస్ రైళ్లు మండలంలోని రాయల చెరువు రైల్వేస్టేషన్లో నిలబడటం లేదని, వాటిని రాయలచెరువులో ఆపేలా చూడాలని ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, ఎంపీడీఓ వీరరాజు, అధికారులు, టీడీపీ మండల కన్వీనర్ రుద్రమ నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

శింగనమల: భూములు రీ సర్వే చేసిన గ్రామాల్లో సభలు నిర్వహించి, రైతుల వినతి మేరకు భూసమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుదామని తహసీల్దార్ బ్రహ్మయ్య సూచించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయర్లు, వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో భూములు రీసర్వే చేసిన గ్రామాల్లో సమస్యలు ఎక్కువ వచ్చాయని, అందులో భాగంగా మట్లగొంది రెవెన్యూ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా తీసుకుని, శనివారం గ్రామసభ నిర్వహిద్దామన్నారు. 20న సర్వే ఉంటుందని, అందరూ హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వరకుమార్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం



మంటలు ఆర్పుతున్న దృశ్యం

గుత్తి రూరల్: మండలంలోని ఈశ్వరపల్లిలో రైతు బోయ పెద్దన్నకు చెందిన గడ్డి వామి శుక్రవారం అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. బాధిత రైతు వివరాల మేరకు.. రైతు పెద్దన్న పశువుల కోసం రూ.50 వేలు వెచ్చించి వేరుశనగ పొట్టు కొనుగోలు చేసి ఇంటి సమీపంలో వామి వేసి ఉంచాడు. అయితే గుర్తు తెలియని వ్యక్తి సిగరెట్ తాగి ఆర్పకుండా పడేయడంతో.. చెత్త అంటుకుని పెద్దఎత్తున మంటలు గడ్డివామికి వ్యాపించాయి. అగ్నిమాపక వాహనం వచ్చి మంటలు అదుపుచేసేలోగా వేరుశనగ పొట్టు మొత్తం కాలిపోయింది. రూ.50 వేలు నష్టం వాటిల్లడంతో పాటు పశువులకు గ్రాసం లేకుండా పోయిందని రైతు విలపించాడు. ఆదుకోవాలంటూ బాధిత రైతు అధికారులకు ఫిర్యాదు చేశాడు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న పెన్షనర్ల అసోసియేషన్ సభ్యులు

తాడిపత్రి అర్బన్: పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం దివ్యాంగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. స్థానిక పెన్షనర్ల అసోసియేషన్ భవన్‌లో అధ్యక్షుడు సత్యప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో 20 మంది దివ్యాంగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు సత్యనారాయణ, ఆదినారాయణస్వామి, అశ్వర్థరెడ్డి, వెంకట్రామయ్య, రంగయ్య తదితర సభ్యులు పాల్గొన్నారు.

యల్లనూరుకు పెద్ద పండుగ

- నేటి నుంచి పెద్దమ్మ జాతర
- ఏడేళ్ల అనంతరం ఉత్సవం



అలంకరణలో పెద్దమ్మ ఆలయం (ఇన్‌సెట్‌లో) అమ్మవారు

యల్లనూరు: యల్లనూరుకు పెద్ద పండుగొచ్చింది. మండల కేంద్రంలోని పెద్దమ్మ, చౌడమ్మ ఆలయాన్ని రంగులతో ముస్తాబు చేశారు. ఏడేళ్ల అనంతరం జాతర నిర్వహిస్తుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జనవరి 18, 19వ తేదీల్లో యల్లనూరులో జాతర వైభవంగా నిర్వహించనున్నారు. కొన్ని అనివార్య కారణాలు, ఆచారం, కట్టుబాట్ల వల్ల ఏడేళ్లుగా జాతరను నిర్వహించలేదని కమిటీ పెద్దలు తెలిపారు. జాతర సందర్భంగా ప్రతి ఇంట్లో బంధువులు, మిత్రుల కోలాహలం కనిపిస్తోంది

జాతర వివరాలివిగో ..

శనివారం ఉదయం పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేస్తారు. 11 గంటలకు కోలాటం ఉంటుంది. హాజరైన భక్తులకు అన్నదాన వసతిని దేవాలయ కమిటీ బృందం ఏర్పాటు చేశారు. సాయంత్రం చౌడమ్మ తల్లి జ్యోతులు కార్యక్రమం ఉంటుంది. అనంతరం పెద్దమ్మ దున్నపోతును ఊరేగింపు చేసి ఆదివారం తెల్లవారుజామున బలిదానం చేస్తారు. తొలి బోనాలను భూమిరెడ్డి వంశీకులు పెద్దమ్మ అమ్మవారికి సమర్పిస్తారు. ఇతరులు బోనాలను అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. మహిళలు పెద్ద ఎత్తున బోనాలను సమర్పించనున్నారు.

యల్లనూరుకు ప్రత్యేక బస్సులు

యల్లనూరు మండల కేంద్రానికి ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతామని తాడిపత్రి డిపో ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజరు నందిని శుక్రవారం తెలిపారు. శని, ఆది వారాల్లో పెద్దమ్మ జాతర, చౌడమ్మ జ్యోతులు ఉండటంతో ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో ఆర్టీసీ అధికారులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసు బందోబస్తు ఇలా..

పెద్దమ్మ జాతర సందర్భంగా యల్లనూరు గ్రామంలో 15 వేల మంది వరకు జనాలు కలుస్తారని గ్రామ పెద్దల అంచనా. అలాగే రెండు రోజుల పాటు దేవర కార్యక్రమం ఉంటుంది. శనివారం నుంచి మండల కేంద్రం పోలీసుల వలయంలో ఉంటుంది. యల్లనూరు, పుట్లూరు మండలాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి ప్రత్యేక పోలీసు సిబ్బందిని పంపి చిన్నపాటి గొడవ జరుగకుండా అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు, పుట్లూరు సీఐ సత్యబాబు బందోబస్తు పర్యవేక్షించనున్నారు.

జాతర ప్రశాంతంగా చేయండి



యల్లనూరులో శని, ఆది వారాల్లో జరిగే పెద్దమ్మ జాతరను ప్రజలు ప్రశాంతంగా చేసుకోవాలని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు ప్రశాంతంగా అందరూ కలిసి జాతర జరుపుకోవాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. గొడవలు ప్రోత్సహించినా, గొడవలకు దిగినా సహించేది లేదన్నారు. కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు.

– వెంకటేశులు, డీఎస్పీ

సంతోషంగా ఉంది



ఏడేళ్ల తర్వాత యల్లనూరుకు పెద్ద పండుగ వచ్చింది. ఇంటింటా బంధువుల సందడి నెలకొంది. పెద్దమ్మ జాతర బాగా జరుగుతుందేది. అనివార్య కారణాలతో ఏడుళ్లుగా ఆగిపోయింది. ఈ ఏడాది జాతర ప్రారంభించడం సంతోషంగా ఉంది.

– కమలాకర్, యల్లనూరు

అందరూ కలవడం ఆనందం



అందరూ కలసి ఐకమత్యంతో జాతరను జరుపుకోనుండడం ఆనందంగా ఉంది. ఎన్నో ఏళ్ల నుంచి పలు కారణాలతో ఈ జాతర వాయిదా పడుతోంది. ప్రస్తుతం జాతర జరిపితే గ్రామాభివృద్ధితో పాటు అన్ని పనులు కలిసి వస్తాయని మా నమ్మకం.

– చిన్నపుల్లయ్య, యల్లనూరు



చౌడేశ్వరీదేవి ఆలయం

'స్వచ్ఛ దివస్' విజయవంతం చేయండి



గుత్తిలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా

గుత్తి: స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమం అమలుపై శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇక నుంచి ప్రతి నెలా మూడవ శనివారం అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రజా సంఘాలను కలుపుకుని స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. శనివారం ఉదయం 8 గంటలకు పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు.

యల్లనూరు: ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ వాసుదేవ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అన్ని సచివాలయాల పరిధిలో పంచాయతీ కార్యదర్శులు ఈ కార్యక్రమం చేపట్టాలన్నారు.


ఆరోగ్యమే.. సంపద



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీఐ

గుంతకల్లు రూరల్: ఆరోగ్యానికి మించిన సంపద లేదని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిని సారించాలని రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక దోనిముక్కల రోడ్డులోని మిస్పా ప్రార్థన మందిరంలో పాస్టర్ జే.మోషే, సిస్టర్ జే.కుమారి ఆధ్వర్యంలో కిమ్స్ సవీరా ఆసుపత్రి వైద్యులచే ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. మనిషికి ఆస్తులు, అంతస్తుల కంటే ఆరోగ్యం ముఖ్యమన్నారు. అనంతరం వైద్యులు పలువురికి గుండె పరీక్షలు నిర్వహించారు.

బయోమెట్రిక్ తప్పనిసరి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ యోగానందరెడ్డి

గార్లదిన్నె: గ్రామ సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ తప్పనిసరిగా వేయాలని ఎంపీడీఓ యోగానందరెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని మర్తాడు గ్రామ సచివా లయం, అంగన్‌వాడీ కేంద్రం, గోకులం షెడ్, డంపింగ్ యార్డులను ఎంపీడీఓ పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది రోజూ విధులకు సకాలంలో హాజరు కావాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలన్నారు. డంపింగ్ యార్డులో తడి, పొడి చెత్త సేకరణ ద్వారా పంచాయతీ ఆదాయం పెంచాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ దామోదరమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా సంకష్టహర చతుర్థి వ్రతం



భోగేశ్వరాలయంలో సంకష్ట చతుర్థి వ్రతం నిర్వహిస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన భోగేశ్వరాలయంలో శుక్రవారం రాత్రి సంకష్ట హర చతుర్థి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సకల విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుని శోభాయానంగా అలంకరించారు. ప్రధాన అర్చకుడు దేవుగుడి రామేశ్వరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు చంద్రాశర్మ, అనిల్ వేద మంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, సుగంధద్రవ్యాలు, ఫల, పుష్ప గరిక అభిషేకాలతో పాటు వినాయకునికి అష్టోత్తర పుష్ప అర్చన ఏక వింశతిపత్ర గరిక పూజ నిర్వహించారు. కథాశ్రవణం గావించి మహామంగళహారతి నిచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

ఆధార్ కేంద్రాల వద్ద పడిగాపులు



ఆధార్ కేంద్రంలో విద్యార్థుల తల్లిదండ్రుల పడిగాపులు

గుత్తి: పట్టణంలోని సచివాలయ ఆధార్ కేంద్రాల వద్ద రెండు నెలలుగా ఆధార్ కరెక్షన్లకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం కూడా ఆధార్ కేంద్రాల వద్ద తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి ఆధార్‌లో మార్పులు, చేర్పుల కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది. మున్సిపాలిటీ వ్యాప్తంగా కేవలం రెండే ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయడం, సర్వర్లు సరిగా పని చేయకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఆధార్ కేంద్రాల సంఖ్యను పెంచాలని పట్టణవాసులు కోరుతున్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేయండి



శింగనమలలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

శింగనమల/బుక్కరాయసముద్రం/పెద్దపప్పూరు: కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తరిమెల పీహెచ్‌సీ వైద్యులు శంకర్‌నాయక్ సూచించారు. ఈ నెల 20 నుంచి వచ్చే నెల 2 వరకూ గ్రామాల్లో కుష్టు వ్యాధిపై సర్వే చేపట్టాలని, ఇందుకు ప్రజలు సహకరించాలన్నారు. ఈ మేరకు శుక్రవారం శింగనమలలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించాలన్నారు. వారికి కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. వ్యాధికి సంబంధించిన మచ్చలు, రాగి రంగు మచ్చలు. స్పర్శ లేని మచ్చలు ఏమైనా ఉన్నాయని పరిశీలన చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది దివ్య భారతి, తిరుపాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

▶▶ బుక్కరాయసముద్రం మండలంలోని కొర్రపాడు పీహెచ్‌సీ కేంద్రంలో కుష్టువ్యాధి నిర్మూలనపై వైద్య సిబ్బందికి డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మోహన్‌బాబు, సామాజిక ఆరోగ్య అధికారి పర్వీన్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

▶▶ పెద్దపప్పూరు మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో ఆశా, ఆరోగ్య కార్యకర్తలతో డాక్టర్ తేజస్విణి సమావేశం నిర్వహించారు. డీపీఎంఓ రామచంద్రయ్య, భారతి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శర్మాస్ వలి, లక్ష్మికుమారి తదితరులు పాల్గొన్నారు.



బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడులో మాట్లాడుతున్న డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని



పెద్దపప్పూరులో మాట్లాడుతున్న డాక్టర్ తేజస్విణి

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి

యల్లనూరు: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తిమ్మంపల్లి పీహెచ్‌సీ సూపర్‌వైజర్ రాము సూచించారు. శుక్రవారం గొడ్డుమర్రి గ్రామంలో ఫ్రైడే డ్రై డే పాటించాలని ర్యాలీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇంటి ఆవరణాన్ని శుభ్రంగా పెట్టుకోవడం వల్ల ప్రాణాంతకమైన డెంగీ, మలేరియా వంటి వ్యాధులు రావన్నారు. నీటి తొట్టెల్లో నిల్వ ఉన్న నీటిని వారానికి ఒకసారి పడేయాలన్నారు. నీటి డ్రమ్ములను తుడిచి ఆరబెట్టుకోవాలన్నారు. ఆరోగ్య సిబ్బంది విజయలక్ష్మి, సౌజన్య, వెంకటలక్ష్మీ, భార్గవి తదితరులు పాల్గొన్నారు.


నేడు రెండు చోట్ల గ్రామసభలు

యాడికి: మండలంలోని కమలపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం మధ్యాహ్నం 2 గంటలకు, కుందనకోట గ్రామ రచ్చకట్ట వద్ద 3 గంటలకు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా గ్రామాల వద్ద ఏపీ జెన్కో ప్రతినిధుల ఆధ్వర్యంలో కమలపాడు పంప్ స్టోరేజ్ ప్రాజెక్టు విషయంపై సభలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి రైతులు హాజరు కావాలన్నారు.

గుత్తి కోట క్యాలెండర్ల ఆవిష్కరణ

గుత్తి: కర్నూలు ఎయిర్ పోర్టులో శుక్రవారం గుత్తి కోట సంరక్షణ సమితి నూతన సంవత్సరం క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు విజయ భాస్కర్, ఎస్‌ఐ శివశంకర్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఓగా నరేంద్ర బాధ్యతల స్వీకరణ



పుట్లూరు: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి పథకం ఏపీఓగా నరేంద్ర శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏపీఓగా ఉన్న చెన్నకేశవులు అనంతపురం రూరల్ ఏపీడీగా పదోన్నతిపై వెళ్లడంతో ఆయన స్థానంలో నరేంద్ర ఇక్కడకు బదిలీ అయ్యారు.

పెనకచెర్ల వీఆర్‌ఓకు పదోన్నతి

గార్లదిన్నె: మండలంలోని పెనకచెర్ల రెవెన్యూ గ్రామంలో వీఆర్‌ఓగా విధులు నిర్వహిస్తున్న ఓబిలేసు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారు. రెండు రోజుల్లో డి.హిరేహాళ్ తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు.

వృద్ధాశ్రమంలో దుస్తుల పంపిణీ

యాడికి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండల కేంద్రంలోని పాత పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న వృద్ధాశ్రమంలో శుక్రవారం గ్రామానికి చెందిన ప్రింటింగ్ ప్రెస్ శ్రీనివాసులు తన కుటుంబ సభ్యులతో కలసి వృద్ధులకు వస్త్ర దానంతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఆశ్రమ నిర్వాహకుడు ప్రకాష్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న రైల్వే కార్మికులు

గుత్తి: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రైల్వే ఇంజినీరింగ్ కార్మికులు శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్ఎస్‌లోని పీడబ్ల్యూ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ చైర్మన్ శేఖర్‌బాబు, వైస్ చైర్మన్ సుధీర్ మాట్లాడారు. ఇంజినీరింగ్ కార్మికులకు పని భారం తగ్గించాలని, అలవెన్స్‌ను 30 శాతానికి పెంచాలని, ట్రాక్ మెయింటనర్ల ఖాళీలను భర్తీ చేయాలని, కీ మెన్‌లకు పనిభారం తగ్గించాలని, పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు పరిష్కరించకపోతే ఆందోళనలు మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీఎస్ నారాయణ, సీనియర్ నాయకులు గోపాల్, రామకృష్ణ, భరత్ పాల్గొన్నారు.

నేడు 'ప్రజావేదిక'

గుంతకల్లు రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శనివారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో మండలంలో నిర్వహించిన ఉపాధి పనులను గత 10 రోజులుగా క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించిన సిబ్బంది పూర్తి స్థాయి నివేదికను సిద్ధం చేశారు. ఈ క్రమంలో ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో ఓపెన్ ఫోరం నిర్వహించి పూర్తి వివరాలను అధికారులకు తెలియజేస్తారని ఆయన తెలిపారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎస్‌ఐ ఆంజనేయులు

పెద్దవడుగూరు: శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ ఆంజనేయులు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని కోనాపురంలో గ్రామసభ నిర్వహించారు. ఈ నెల 20, 21న నిర్వహించనున్న దేవర ఉత్సవం నేపథ్యంలో గ్రామంలో ఎవరైనా మద్యం సేవించి గొడవలను సృష్టించడానికి ప్రయత్నిస్తే సహించబోమని హెచ్చరించారు. ఏమైనా సమస్యలు తలెత్తితే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



నీటి డ్రమ్ములు పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఓబులు

బుక్కరాయసముద్రం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఓబులు సూచించారు. శుక్రవారం మండలంలోని గోవిందపల్లి, జంతలూరు గ్రామాల్లో వైద్య సిబ్బంది పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో మురుగు గుంటలు, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. దోమలు ప్రబలకుండా చూడాలన్నారు.ఎంపీడీఓ సాల్మాన్, సీహెచ్‌ఓ మోహన్ పాల్గొన్నారు.